## క్లుప్తంగా

### నగరాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం



**భవానీపురం(విజయవాడపశ్చిమ):** నగర సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, అందులో భాగంగా నగరంలోని వివిధ ప్రాంతాలలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం సాయంత్రం నిర్వహించిన స్థాయీ సంఘ సాధారణ సమావేశంలో మొత్తం 21 అంశాలపై చర్చించారు. వాటిలో 13 అంశాలకు సంబంధించి సభ్యులు ఆమోదించారు. ఒకటి ధ్రువీకరించగా, 7 అంశాలను వాయిదా వేశారు. అధికారులు, స్థాయీ సంఘ సభ్యులు పాల్గొన్నారు. అడిషనల్ కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్, స్థాయీ సంఘ సభ్యులు షేక్ రెహమతున్నీసా, శిరంశెట్టి పూర్ణ, ఉద్దంటి సునీత, కుమారి, ఆలంపూరి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### సత్యవ్రత వైభవాన్ని చాటిన 'హరిశ్చంద్ర'



**విజయవాడకల్చరల్:** విక్కీ కల్చరల్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో వినాయక చవితి సందర్భంగా సోమవారం ప్రదర్శించిన నాటికలు పద్యనాటిక వైభవాన్ని చాటాయి. తొలి నాటికగా బలిజేపల్లి లక్ష్మీకాంత కవి రచించిన హరిశ్చంద్ర నాటకంలోని అడవి సన్నివేశాన్ని రక్తి కట్టించేలా ప్రదర్శించారు.1వ హరిశ్చంద్రునిగా తిరువూరుకు చెందిన డీవీ రావ్, 2వ హరిశ్చంద్రునిగా శ్రీనివాసరెడ్డి, చంద్రమతిగా విజయరాణి, నక్షత్రకునిగా ఎస్కే బుజ్జి నటించారు. రెండో నాటికగా భక్త కన్నప్ప నాటికను ప్రదర్శించారు. తిన్నడుగా శ్రీనివాసరావు, రుద్రనిగా రమేష్ వేంపాటి, నీలగా అమృత వర్షిణి, కైలాసనాథ శాస్త్రిగా కేఎస్ఆర్ కృష్ణ ప్రసాద్ నటించారు. నాటికలను పత్తిపాటి శ్రీనివాసరావు నిర్వహించారు.

### ఉత్తమ విద్యార్థినికి సత్కారం



**మధురానగర్(విజయవాడసెంట్రల్):** తన వద్ద విద్యాబుద్ధులు నేర్చుకుని నీట్‌లో ర్యాంకు సాధించి విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు పొందిన విద్యార్థినిని జంతు శాస్త్ర అధ్యాపకుడు నిజాంపట్నం గోకర్ణేశ్వరరావు సోమవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన స్టూడెంట్ షేక్ అఫిఫా తబస్సుమ్ 2023 -2025 విద్యా సంవత్సరాల్లో ఇంటర్మీడియెట్ బైపీసీలో 992 మార్కులు సాధించిందన్నారు. అదేవిధంగా నీట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించి విజయనగరంలో ఫ్రీ సీటు సాధించటం తనకు సంతోషంగా ఉందని చెప్పారు. అధ్యాపకుడు అభినందించటం పట్ల విద్యార్థిని కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

### ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

**పాయకాపురం(విజయవాడరూరల్):** భార్యాభర్తల మధ్య ఆర్థిక సమస్యలతో ఏర్పడిన గొడవల కారణంగా సుత్తాపల్లి దిలీప్‌కుమార్ (36) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై నున్న పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు, పాయకాపురం శాంతినగర్‌లో నివాసం ఉంటున్న దిలీప్‌కుమార్ అద్దె ఆటో నడుపుతూ, ఫైనాన్స్‌లో వస్తువులను కొనిపించి కమీషన్ తీసుకుంటాడు. ఈ నేపథ్యంలో రూ.10 లక్షల వరకు అప్పులయ్యాయి. ఈ విషయంలో భార్య అనూషతో తరుచుగా గొడవలు పడుతున్నాడు. సోమవారం గొడవ జరగడంతో దిలీప్‌కుమార్ ఇంటిలోకి వెళ్లి తలుపులు వేసుకొని చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన అనూష భర్తను చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. అనూష ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి పంపారు.

# బెంబేలెత్తిస్తున్న గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లు

- అజిత్‌సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో హల్‌చల్
- నేరస్తులకు కొమ్ము కాస్తున్న కూటమి నేతలు
- పోలీసుల తీరుపై విమర్శలు





అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్



సింగ్‌నగర్‌లో జరిగిన గ్యాంగ్ వార్ సమయంలో గుమిగూడిన యువకులు (ఫైల్)

**అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):** అజిత్ సింగ్‌నగర్ ప్రాంతం ఈ పేరు వింటేనే ప్రస్తుతం నగర ప్రజలకు వణుకుపుడుతోంది.. ఇటీవల కాలంలో సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంటున్న వరుస ఘటనలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### ఇటీవల జరిగిన పలు ఘటనలు

- సింగ్‌నగర్ ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుకుంటున్న ఓ విద్యార్థినిని ఆకతాయిలు ప్రతి రోజూ వేధింపులకు గురిచేస్తున్నారు. ఈ విషయాన్ని బాలిక తన తల్లిదండ్రులకు చెప్పడంతో ఈ నెల 7న బాలిక తండ్రి పాఠశాల వద్దకు వచ్చి చూడగా ఆకతాయిలు మళ్లీ అదే విధంగా ఆమె వెంటపడి ఏడిపించడం చేస్తున్నారు. దీంతో ఆ తండ్రి వారిని పిలిచి మందలించేందుకు ప్రయత్నించగా ఆకతాయిలు ఒక్కసారిగా ఆయనపై పిడిగుద్దులతో రెచ్చిపోయి.. మాకే నీతులు చెబుతావా.. నీ అంతు చూస్తామంటూ బ్లేడ్లు, కర్రలతో ఆయనను చితకబాదారు.
- న్యూఆర్ఆర్‌పేటకు చెందిన చింతకాయల కిరణ్(33) అనే వ్యక్తి బ్యానర్లు కట్టే పని చేస్తుంటాడు. ఈ నెల 15న తన ఇంటి నుంచి నడుచుకుంటూ పనికి వెళ్తుండగా సాయి, మంగి మహంకాళి అనే ఇద్దరు వ్యక్తులు కిరణ్‌ను అడ్డగించి మద్యం తాగేందుకు డబ్బులు అడిగారు. నా దగ్గర లేవని కిరణ్‌బదులివ్వగా వారిద్దరు అతనిపై విరుచుకుపడ్డారు.. డబ్బులడిగితే ఇవ్వవా నిన్ను చంపేస్తానంటూ కీ చేన్‌తో కిరణ్ ముఖంపై గాయపర్చి పరారయ్యారు.
- సింగ్‌నగర్ లూనాసెంటర్‌లో ఈ నెల 14న రాత్రి పాత గొడవల నేపథ్యంలో గ్యాంగ్ వార్ జరిగింది. సింగ్‌నగర్ లూనాసెంటర్ ప్రాంతానికి చెందిన రెడ్లం దుర్గారావు(32) అనే వ్యక్తి సోదరిని అదే ప్రాంతానికి చెందిన సాయికుమార్ అనే వ్యక్తి వేధింపులకు గురిచేస్తున్నాడనే నెపంతో పెద్ద వివాదం చోటుచేసుకుంది. ఇరువర్గాలు కత్తులు, కర్రలు, సుత్తులు పట్టుకొని గ్రూపులుగా ఏర్పడి లూనాసెంటర్‌లో రోడ్లపై పరుగులు తీస్తూ కొట్టుకున్నారు. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలకు లోనయ్యారు. ఈ వివాదంపై పోలీసులు ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు. అయితే రాజకీయ నాయకుల ఒత్తిళ్ల వల్ల ఈ కేసులో అసలైన ముద్దాయిలను వదిలేసి మిగిలిన వారిపై మాత్రమే కేసులు నమోదు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- తన భార్యను తన నుంచి వేరు చేశారనే అక్కసుతో ఓ గంజాయి బ్యాచ్ సభ్యుడు ఈ నెల 12న తన అత్తమామలపై నడిరోడ్డుపై విచక్షణా రహితంగా దాడులకు పాల్పడి వారిని గాయపర్చాడు. దీంతో వారు రోడ్లపైకి రావాలంటే భయపడిపోతున్నారు.

ఇలా సింగ్‌నగర్‌లో ఆకతాయిలు, గంజాయి బ్యాచ్, బ్లేడ్ బ్యాచ్ సభ్యుల ఆగడాలు రోజురోజుకు మితిమీరిపోతున్నాయి.

### నేరస్తులపై కొరవడుతున్న నిఘా..

ఇక్కడి ఆకతాయిలు, నేరస్తులకు కొంతమంది కూటమి నాయకుల అండదండలు లభిస్తున్నాయి. దీంతో వారిపై ఎటువంటి ఫిర్యాదులు అందినా వెంటనే తమ్ముళ్లు రంగంలోకి దిగి వారిని కేసుల్లో నుంచి తప్పిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో ఏమి చేసినా తమకు ఏమి కాదని, పోలీసులు కూడా తమను ఏమీ చేయలేరని భావిస్తున్న వారు భయటకు వచ్చి మరింత క్రూరంగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఇటువంటి ఘటనలు జరిగిన వెంటనే ఆయా పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక పోలీసు బీట్లు ఏర్పాటుచేసేవారు. సమస్యాత్మక ప్రాంతాల్లో నైట్ రౌండ్స్‌లో పోలీసులు వచ్చి సంతకాలు చేసి వెళ్లడం.. స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకోవడం చేసేవారు. వీటితో పాటు నేరస్తులకు భయం కలిగేలా.. ప్రజలకు నేరాల నియంత్రణకు మేమున్నామంటూ భరోసా కల్పించేలా పోలీసులు మాక్‌డ్రిల్ చేయడం.. గస్తీలు నిర్వహించడం.. తెల్లవారుజాములు.. అర్ధరాత్రులు నేరస్తుల సమస్య అధికంగా ఉన్న ప్రాంతాల్లో కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమాలు చేపట్టేవారు. అయితే ఇటీవల కాలంలో ఎన్ని ఘటనలు చోటుచేసుకుంటున్నా.. ఎన్ని ఫిర్యాదులు అందుతున్నా పోలీసులు ఎటువంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడంలో.. ప్రజలకు భరోసాను కల్పించడంలో విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సింగ్‌నగర్ ప్రాంతంపై ప్రజల్లో ఏర్పడుతున్న భయాందోళనలను తొలగించాల్సిన బాధ్యత పోలీసు ఉన్నతాధికారులపై ఉందని.. ఈ ప్రాంతాల్లో పెరుగుతున్న అల్లర్లు, నేరాలను నియంత్రించి తమకు రక్షణ కల్పించాలని స్థానికులు ప్రాధేయపడుతున్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** మధురానగర్ విద్యుత్ సెక్షన్ 11 కె.వి. మధ్యకట్ట ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యానిర్వాహక ఇంజినీర్ పీ రవీంద్రబాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుడమేరు మధ్య కట్ట, విజయదుర్గా నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

**అమెరికన్ హాస్పిటల్ పరిధిలో..**

**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** అమెరికన్ హాస్పిటల్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం మంగళవారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మ్యూజియం రోడ్డు, బందర్ రోడ్డు, సూర్యారావుపేట పోలీస్ స్టేషన్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. ఆయా ప్రాంతాల్లోని వినియోగదారులు గమనించి తమ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

### మద్యం తాగి వాహనాలు నడిపిన 55 మందికి జరిమానా

**లబ్బీపేట(విజయవాడతూర్పు):** మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన 55 మందికి న్యాయమూర్తి జరిమానా విధించారు. సీపీ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు ఒకటో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో 55 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడారు. వారిపై కేసులు నమోదు చేసిన పోలీసులు సోమవారం ఏడో అడిషనల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కమ్ రైల్వే కోర్టులో హాజరుపర్చారు. న్యాయమూర్తి ఆర్‌వీఎస్ శర్మ ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు.

## ప్రజలకు సమస్యలు తలెత్తకుండా చూడండి

**భవానీపురం(విజయవాడపశ్చిమ):** నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్‌కంట్రోల్ రూమ్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) జరిగింది. ఇందులో 31 ఫిర్యాదులు అందగా వాటిల్లో పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి 7, ఇంజినీరింగ్ - 6, రెవెన్యూ- 2, ప్రజారోగ్య విభాగానికి సంబంధించి -1, పీఓ (యూసీడీ)- 11, ఎస్టేట్ -1, హౌసింగ్-2, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్-1 ఉన్నాయి. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అదనపు కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జున రావు, పర్యవేక్షణ ఇంజినీర్లు పి.సత్యకుమారి, పి.సత్యనారాయణ, డెప్యూటీ డైరెక్టర్ (హార్టీకల్చర్) చంద్రశేఖర్, ఎస్టేట్ ఆఫీసర్ ఎ.శ్రీధర్, బయాలజిస్ట్ కామేశ్వరరావు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బీఎస్ఎస్ సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

## మట్టి గణపతినే పూజిద్దాం



మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తున్న గౌతంరెడ్డి

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** వినాయక చవితి వేడుకలలో మట్టిగణపతినే పూజించి... పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ముత్యాలంపాడు శ్రీషిర్డీసాయిబాబా మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి అన్నారు. స్థానిక సాయిబాబా మందిరంలో సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యాన మట్టి గణపతి విగ్రహాల ఉచిత పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతినే వినియోగించాలని ప్రజలలో అవగాహన కల్పించటంతో పాటు ప్రతీ ఏటా ఉచితంగా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఆలయంలో కూడా మట్టి గణపతితోనే వినాయక చవితి వేడుకలు నిర్వహిస్తామన్నారు. మందిర కోశాధికారి మండలపర్తి సత్యశ్రీహరి మాట్లాడుతూ మట్టి గణపతి విగ్రహాలను మంగళవారం కూడా ఉచితంగా పంపిణీ చేస్తామని తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## బస్సు కిందకు దూసుకెళ్లిన బైక్

**– ప్రాణాలు కాపాడిన హెల్మెట్**



**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** ఏలూరు రోడ్డులోని పాత బస్టాండ్ సమీపంలో ఆర్టీసీ బస్సు కిందకు సోమవారం ఓ బైక్ దూసుకెళ్లింది. నగరానికి చెందిన ఇద్దరు యువకులు బైక్‌పై వెళ్తూ బస్సు టైర్ పక్కన పడిపోయారు. ఇద్దరూ హెల్మెట్ ధరించి ఉండడంతో వారికి ప్రాణాపాయం తప్పింది. స్వల్పగాయాలతో బయటపడ్డారు. ట్రాఫిక్ ఎస్ఐ బేగ్, స్థానికులు బస్సు కింద బైక్‌ను తొలగించి యువకులకు సపర్యలు చేశారు. ప్రాణాపాయం తప్పడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

## పెండింగ్ ఫీజు బకాయిలు విడుదల చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపులో సోమవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, జీవో నంబర్ 77 రద్దు చేయాలని, తల్లికి వందనం ఆర్థిక సహాయం చేయాలని డిమాండ్ చేసింది. అనంతరం ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు కలెక్టరేట్‌లో డీఆర్వో లక్ష్మీనరసింహంను కలిసి వినతి పత్రం అందజేశారు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కె.ప్రసన్నకుమార్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయాలని రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ల ఎదుట ఆందోళన చేపట్టామన్నారు. ఇప్పటికై నా ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగ సమస్యల పరిష్కారం చేయడంలో విఫలమైందన్నారు. ఎన్నికల సమయంలో విద్యార్థులు, యువతకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు టి.కుమారస్వామి, నాయకులు ప్రణీత, మాధవ్, షణ్ముఖ, ప్రసాద్, జస్విన్, యశస్విని, శ్యామ్, జిశ్రీ రెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏడాది గడుస్తున్నా.. ఇంకా వరద భయంలోనే జనం..!



వరద బాధితులతో మాట్లాడుతున్న బాబూరావు

**అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):** బుడమేరు వరదలు జరిగి ఏడాది కాలం గడుస్తున్నా నేటికి ఇక్కడి ప్రజలు ఇంకా వరద భయంలోనే ఉన్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. సింగ్‌నగర్, పాయకాపురం పరిసర ప్రాంతాల్లోని వరద బాధిత ప్రాంతాల్లో సీపీఎం నాయకులతో కలిసి సోమవారం ఆయన పర్యటించారు. బాధితులను కలుసుకొని వారి గోడును విన్నారు. బాబూరావు మాట్లాడుతూ బుడమేరు వరదలు నగర ప్రజలకు కోలుకోని దెబ్బ తీశాయని.. ప్రజలను ఆదుకొని వారికి కొండంత భరోసాను కల్పించాల్సిన కూటమి ప్రభుత్వం ఆ దిశగా పూర్తిస్థాయి చర్యలు చేపట్టలేదన్నారు. ముంపు నివారణ చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని.. పాలకులు మానవత్వం లేకుండా వ్యవహరించడం దారుణమన్నారు.

**ఈ నెల 30న ధర్నాకు పిలుపు..**

ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి శాశ్వత ముంపు నివారణ చర్యలు చేపట్టాలని.. పది వేల కోట్ల రూపాయలు తక్షణం విడుదల చేసి వెలగలేరు రెగ్యులేటర్ ఎగువన, దిగువన, కొల్లేరు, సముద్రం వరకూ మొత్తం బుడమేరుని ఆధునీకరించాలని.. సమాంతర కాలువ, రక్షణ గోడల నిర్మాణం చేపట్టాలని డిమాండ్‌చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా ఈ నెల 30వ తేదీన సీపీఎం ఆధ్వర్యంలో వరద బాధితులతో కలిసి ధర్నా నిర్వహిస్తున్నామని, ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం నాయకులు రమణారావు, దుర్గారావు, ప్రవీణ్, నిజాముద్దీన్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## విశ్వనాథ సాహిత్యంపై వ్యాసరచన పోటీలు

**విజయవాడకల్చరల్:** జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత విశ్వనాథ సత్యనారాయణ సాహిత్య జీవితంపై వ్యాస, పద్య రచన పోటీలను నిర్వహిస్తున్నట్లు సంస్కారభారతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంకుమార్ గూటాల తెలిపారు. సోమవారం సంస్థ కార్యాలయంలో ఆయన వివరాలను వెల్లడించారు. తెలుగు సాహితీ మూర్తుల తేజోమయమైన జీవితాలను భావి తరాలకు అందించాలనే సంకల్పంతో కవి సమ్రాట్ విశ్వనాథ సాహిత్య సమాలోచన కార్యక్రమంలో భాగంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంస్కారభారతి అఖిల భారత సంఘటనా మంత్రి అభిజిత్ గోఖలే మాట్లాడుతూ విశ్వమంత కవి విశ్వనాథ అన్నారు. పోటీలలో ఉచితంగా పాల్గొనవచ్చని.. 6 నుంచి 10వ తరగతి వారికి జూనియర్, సీనియర్ విభాగాలలో తెలుగు పద్యపఠన, వ్యాస రచన పోటీలు, ఇంటర్ ఆపై చదివే వారు విశ్వనాథ కావ్య సమీక్ష, విశ్వనాథకు లేఖ అంశాలలో పోటీ పడవచ్చన్నారు. ఈ నెల 28లోపు 98480 35573 వాట్సాప్ నంబరులో సంప్రదించాలన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**మధురానగర్(విజయవాడసెంట్రల్):** 26వ డివిజన్‌లో స్మార్ట్ రేషన్ కార్డులను కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి, డివిజన్ ఇన్‌చార్జి వల్లభనేని సతీష్, తోట పాండుతో కలిసి సోమవారం ఇంటింటికీ వెళ్లి అందజేశారు. 28వ డివిజన్ వార్డు సచివాలయంలో కార్పొరేటర్ వీరమాచనేని లలిత స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో వార్డు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## బీబీఏ సాక్షిగా ఒక్కటైన ప్రేమజంట



నూతన వధూవరులతో బీబీఏ ప్రతినిధులు

**విజయవాడలీగల్:** కులాలు వేరైన ప్రేమజంటకు బెజవాడ బార్ అసోసియేషన్ అండగా నిలిచి సోమవారం ఆదర్శ వివాహం జరిపించారు. నగరంలోని జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీకి చెందిన నాగిరికంటి ఆకాష్, కందివలస సాహిత్యరాణి గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. వీరి ప్రేమ వ్యవహారం తెలిసిన యువతి కుటుంబ సభ్యులు ప్రేమ వివాహానికి నిరాకరించడమే కాకుండా బెదిరించారు. దీనితో వారిరువురు ప్రాణహాని ఉందంటూ నగర పోలీసు కమిషనర్‌ను ఆశ్రయించారు. వారు మేజర్లు కావడంతో కమిషనర్ వారికి అండగా ఉంటానని హామీఇచ్చారు. అనంతరం ప్రేమజంట బీబీఏ ప్రెసిడెంట్ ఏకే బాషాను కలిశారు. దీంతో బీబీఏ ఆధ్వర్యంలో వివాహం జరిపించి, వధూవరులను ఆశీర్వదించారు.

### సాధన ఉన్నత ప్రగతికి సోపానం

**విజయవాడకల్చరల్:** సాధన ఉన్నత ప్రగతికి సోపానమని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. గుంటూరుకు చెందిన వీఆర్ ఈవెంట్స్, కళా సాధల ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ఆశీష్ స్టూడియోలో సినీ సంగీత విభావరి, గాయకులకు వివిధ రంగాలకు చెందిన వారికి సత్కార కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ.. గాయకులు నిరంతరం సాధన చేయాలన్నారు. విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్‌రాజు మాట్లాడుతూ కళా సాంస్కృతిక సంస్థలు కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. గాయనీ గాయకులు చింతా వాసు, సీహెచ్ రజనీ ఆధ్వర్యంలో చిత్ర గీతాలను ఆలపించారు. సేవా సదన్ అధ్యక్షుడు మిరియాల గోపీకుమార్, కళాసాధ అధ్యక్షుడు బిళ్లా అశోక్‌కుమార్, శ్యాంప్రసాద్, డీవీ వీరభద్రరావు, పరుచూరి విజయలక్ష్మి జోషి, వి.రాము, ఏ సూర్య, రామకృష్ణ, బోలేపల్లి సుబ్బారావు, నజీర్, సత్య పాల్గొన్నారు.

### 28న హుండీ కానుకల లెక్కింపు

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** స్వయంభూ మాచవరం శ్రీ దాసాంజనేయస్వామివారి దేవాలయంలో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకల లెక్కింపు ఈనెల 28వ తేదీ గురువారం జరుగుతుందని ఆలయ ఈవో పాతూరి లోకేశ్వరి సోమవారం తెలిపారు. గురువారం ఉదయం హుండీ లెక్కింపు సేవా సంఘం, దేవదాయ శాఖ ఉన్నత అధికారుల పర్యవేక్షణలో జరుగుతుందన్నారు.



## ● జోరందుకున్న విక్రయాలు



జిల్లా వ్యాప్తంగా గణేష్ విగ్రహాల విక్రయాలు సోమవారం జోరందుకున్నాయి. నున్న మ్యాంగో మార్కెట్‌లో తయారు చేసిన వినాయక విగ్రహాలను కొనుగోలు చేసేందుకు ఉత్సవ కమిటీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చాయి. దీంతో మ్యాంగో మార్కెట్ పరిసరాల్లో కోలాహలం నెలకొంది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



## రాయితీలు వెంటనే విడుదల చేయాలి

**ఏపీ ఎస్సీ, ఎస్టీ ఎంటర్‌ప్రెన్యూర్స్ అసోసియేషన్ జేఏసీ**



మాట్లాడుతున్న జేఏసీ ప్రతినిధులు

**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రావాల్సిన ఎంఎస్ఎంఈ రాయితీలు ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ ఎంటర్‌ప్రెన్యూర్స్ అసోసియేషన్ జేఏసీ డిమాండ్ చేసింది. సోమవారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో జేఏసీ కన్వీనర్ ఈడుపుగంటి అనార్ బాబు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రావాల్సిన రాయితీల విషయంలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. ఫలితంగా అనేక యూనిట్లు మూసివేత దశకు చేరుకున్నాయన్నారు. బ్యాంకు ఖాతాలు ఎన్‌పీఏలుగా మారాయని, వేలాది కుటుంబాలు ఉపాధి కోల్పోయి రోడ్డునపడ్డాయన్నారు. రాయితీల విషయంలో కూటమి ప్రభుత్వం అశ్రద్ధ వహిస్తోందన్నారు. గత 30 ఏళ్లుగా పరిశ్రమలు నిర్వహిస్తున్నామని, ఏనాడు ఇలాంటి పరిస్థితి ఎదురు కాలేదన్నారు.

**రూ.650 కోట్లు పెండింగ్..**

ఏపీఎస్ఆర్టీసీ హైర్ బస్సెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రూ.650 కోట్లు రాయితీలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. సమావేశంలో నాగా కుమార్ పినమాల, వెంకటేష్ ఉల్లి, ఆంధ్రప్రదేశ్ ఎస్సీ ఎస్టీ ఎంట్రప్రెన్యూర్స్ అసోసియేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.